క్లుప్తంగా

సిలువగట్టు తిరునాళ్ల ప్రారంభం



నూజివీడు: పట్టణ శివారులోని సిలువగట్టు తిరునాళ్లు బుధవారం రాత్రి ప్రారంభమైంది. సిలువగట్టు పుణ్యక్షేత్రం రెక్టార్ ఫాదర్ గొర్రుముచ్చు జోసఫ్ తిరునాళ్లను ప్రారంభించారు. ఫాదర్ పంతగాని లాజరు దివ్యబలి పూజ నిర్వహించారు. ఫాదర్ జోసఫ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేవుడిపై భక్తితో జీవించాలని సూచించారు. తిరునాళ్ల సందర్భంగా సిలువ గట్టు ప్రాంతాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉత్సవాల కమిటీ నిర్వాహక సభ్యులు, మరియదళ సభ్యులు పాల్గొన్నారు.

రేపు వికాస్‌లో క్యాంపస్ సెలక్షన్స్

విస్సన్నపేట: విస్సన్నపేట వికాస్ కాలేజీలో ఈ నెల 28న క్యాంపస్ సెలక్షన్స్ జరుగుతాయని కళాశాల కరస్పాండెంట్ నరెడ్ల నర్సిరెడ్డి తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన బయోలాజికల్ ఈ లిమిటెడ్ సంస్థ 2023–24, 2024–25 విద్యా సంవత్సరాల్లో ఎమ్మెస్సీలో బయో కెమిస్ట్రీ, ఆర్గానిక్ కెమిస్ట్రీ, అనలిటికల్ కెమిస్ట్రీ, బయో టెక్నాలజీ, మైక్రో బయాలజీ విద్యార్థులకు, బీఫార్మసీ, బీఎస్సీ లైఫ్ సైన్సెస్, డిప్లమోలో మెకానికల్, ట్రిపుల్ ఈ, కెమికల్ ఇంజినీరింగ్ కోర్సుల విద్యార్థులకు ఈ ఎంపిక నిర్వహిస్తామన్నారు. ఇతర వివరాలకు సెల్: 98495 53107, 99514 32997 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

రచయితలకు సత్కారం



తిరువూరు: గంపలగూడెం మండలం పెనుగొలను శివాలయంలో మహా శివరాత్రి సందర్భంగా షిర్డీ సాయి సేవా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం పలువురు రచయితలను సత్కరించారు. సామాజిక అంశాలపై రచనలు చేస్తూ ప్రజలను చైతన్యపరుస్తున్న 24 మంది రచయితలను కమిటీ అధ్యక్షుడు నారాయణరావు సన్మానించారు. రచయితల సంఘ ప్రతినిధులు పసుపులేటి వెంకయ్య, కోటేశ్వరశర్మ, రామాల నాగేశ్వరరావు, సుబ్బరాజు, శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

బెల్టు దుకాణాలపై దాడులు

తిరువూరు: తిరువూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని విస్సన్నపేట మండలంలో అనధికారిక మద్యం విక్రయాల నిరోధానికి ఎక్సైజ్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. విస్సన్నపేటలో రెడ్డిగూడెం రోడ్డులోని కనక దుర్గా వైన్స్ వద్ద అనుమతి లేనిచోట 123 పెట్టెల్లో 4,500 మద్యం సీసాలను సీజ్ చేసి కేసు నమోదుచేశారు. విస్సన్నపేట అంబేడ్కర్ సెంటర్లో అనధికారికంగా నిల్వ చేసిన 32 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని అనుమోలు పాండురంగారావుపై కేసు నమోదు చేశారు. కొండపర్వలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న సాంబశివరావు వద్ద 33 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. తెల్లదేవరపల్లిలో మూడే మరియరాణి వద్ద ఆరు మద్యం సీసాలు, పుట్రేలలో కొండా మారేష్ వద్ద 10 మద్యం సీసాలు, గంపలగూడెంలో కోట సురేష్ వద్ద 8 మద్యం సీసాలు అమ్మకానికి ఉంచినట్లు గుర్తించి స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేశారు. ఉమ్మడదేవరపల్లిలో బండి కొల రమేష్ 10 తెలంగాణ మద్యం సీసాలను మోపెడ్‌పై తెస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేశారు. తిరువూరు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ దాడులు జరిపారు.

దాడి కేసులో నలుగురికి రిమాండ్

జి.కొండూరు: స్థలం వివాదమై పాతకక్షల నేపథ్యంలో భార్యభర్తలపై నలుగురు వ్యక్తులు దాడి చేసిన ఘటనలో నిందితులను అరెస్టు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జి.కొండూరు మండల పరిధి ఆత్కూరు గ్రామానికి చెందిన బొర్రా సాంబశివరావు, సత్యవతి దంపతులపై మంగళవారం రాత్రి ఆదే గ్రామానికి చెందిన పటాపంచల సురేష్, పటాపంచల గోపి, పటాపంచల సాంబశివరావు, గంగుల బాలాజీలు కత్తి, కర్రలతో దాడి చేశారు. బాధితులు జి.కొండూరు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం విజయవాడకు తరలించారు. నిందితులు నలుగురుని అదుపులోకి తీసుకుని బుధవారం రిమాండ్‌కు తరలించారు.

20 మద్యం సీసాలు స్వాధీనం

నందిగామరూరల్:మద్యం అక్రమ విక్రయాలు జరిపితే సహించేది లేదని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ బంగార్రాజు హెచ్చరించారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని దాములూరు కూడలి గ్రామ పరిధిలో మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. గ్రామంలో జరుగుతున్న మహా శివరాత్రి ఉత్సవాలలో అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్న వడ్డిబోయిన మోహనరావు, కనగాల రత్తయ్యలను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో ఎస్ఐ యుగంధర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

శంభో శివ శంభో

- భక్తిశ్రద్ధలతో మహా శివరాత్రి వేడుకలు
- భక్తులతో పోటెత్తిన శివాలయాలు
- తెల్లవారుజాము నుంచే పుణ్య స్నానాలు
- ప్రత్యేక అలంకారాల్లో లింగాకారుడు



ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం వద్ద పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్తులు



తిరువూరు చంద్రమౌళీశ్వరాలయంలో..

తిరువూరు: మహా శివరాత్రి పర్వదిన వేడుకలు తిరువూరు, మైలవరం, నూజివీడు నియోజకవర్గాల్లో బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుఝాము నుంచే భక్తులతో శివాలయాలు కిటకిటలాడాయి. పుణ్యస్నానాలు ఆచరించి పూజలు చేశారు. ఆలయాల్లో ఉదయం నుంచే భక్తుల రద్దీ కనిపించింది. ఆయా ఆలయ కమిటీలు భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

తిరువూరులోని రామలింగేశ్వరాలయం, చంద్రమౌళీశ్వరాలయం, షిర్డీ సాయి మందిరం, గౌరీకేదారేశ్వ రాలయాలలో పరమేశ్వరుడికి పంచామృతాలతో అభిషేకం, రుద్రాభిషేకాలు, విశేషపూజలు నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. తిరువూరు చంద్రమౌళీశ్వరాలయం వద్ద వాసవీ క్లబ్ సభ్యులు ప్రసాదాలు పంపిణీ చేశారు. తిరువూరు మండలంలోని మునుకుళ్ల అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వరాలయం, పెద్దవరం గంగదేవుళ్ల ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి పితృదేవతలకు తర్పణలు అర్పించారు. ఖమ్మం జిల్లా గుట్టపాడు, నీలాద్రి శివాలయాలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం తిరువూరు ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడిపారు.

గంపలగూడెం మండలంలో..

గంపలగూడెం మండలం మేడూరు జీవన్ముక్తేశ్వరాలయంలో శివలింగాలకు భక్తులు విశేషాభిషేకాలు చేశారు. గంపలగూడెం, కొత్తపల్లి, పెనుగొలను ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. ఎ.కొండూరు మండలం గోపాలపురం, కంభంపాడు గ్రామాల్లో మహా శివరాత్రి వేడుకలు జరిపారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట, పుట్రేల శివాలయాలు, కొండపర్వ భ్రమరాంబికా సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానాల్లో మహా శివరాత్రి వేడుకలు జరిగాయి. వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు, విస్సన్నపేట జెడ్పీటీసీ లోకేశ్వర రెడ్డి, వైస్ ఎంపీపీ గాజుల శ్రీనివాసరావు, మాజీ వైస్ ఎంపీపీ ఓలేటి దుర్గారావు, భూక్యా రాణి, కొండపర్వ సర్పంచి రమేష్‌బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పూజాదికాలు నిర్వహించారు. తిరువూరు సీఐ గిరిబాబు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కొండపర్వ తిరునాళ్లకు, స్వామివారి కల్యాణోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. శివరాత్రి సందర్భంగా ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు.

మార్మోగిన శివనామ స్మరణ

నూజివీడు: స్థానిక బస్టాండ్ సమీపంలోని దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్ధనారీశ్వరుడి అలంకరణలో దర్శనమిచ్చిన స్వామి వారికి ఉదయం అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం దుర్గా మల్లేశ్వరస్వామి వారికి కల్యాణం నిర్వహించారు. అనంతరం స్వామి వారిని నంది వాహనంపై పట్టణ వీధుల్లో ఊరేగించారు. ప్రతి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కోట శివాలయంలో తెల్లవారుజాము నాలుగు గంటలకే రుద్రాభిషేకం నిర్వహించారు. రాత్రి 7.30 గంటలకు స్వామి వారి కల్యాణ మహోత్సవం జరిగింది. 9 గంటలకు స్వామి వారి పవళింపు సేవ నిర్వహించారు. మండలంలోని అన్నవరంలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు శివపంచాక్షరీ ఏకనామ జప భజన నిర్వహించారు.

నీలకంఠేశ్వరుడికి పూజలు

ఇబ్రహీంపట్నం: స్థానిక పవిత్ర సంగమం, తుమ్మలపాలెం, జూపూడి, దాములూరు, గుంటుపల్లి గ్రామాల్లోని స్నానఘాట్ల వద్ద తెల్లవారుజాము నుంచి భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. మహిళలు, వృద్ధులు, దివ్యాంగుల సౌకర్యార్థం అధికారులు జల్లు స్నానాలకు ఏర్పాట్లు చేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రాంతంలో పితృ దేవతలకు పిండ ప్రదానాలు జరిపారు. పుణ్యస్నానాల అనంతరం ఆది దంపతులను దర్శించుకునేందుకు స్థానిక త్రిపురాంతకేశ్వరి ఆలయం, దాములూరు కోటేశ్వరస్వామి, కాచవరం రామలింగేశ్వరాలయం, జూపూడి శివాలయాలను భక్తులు దర్శించుకున్నారు. శ్రీసత్యసాయి సేవా ట్రస్ట్‌తో పాటు వివిధ స్వచ్ఛంద సేవా సంస్థలు భక్తులకు అల్పాహారం, మజ్జిగ, తాగునీరు పంపిణీ చేశారు. పీహెచ్‌సీ అధికారులు వైద్య శిబిరం, పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

వెల్వడం గ్రామంలో..

మైలవరం: మైలవరం మండలం వెల్వడం గ్రామంలోని బాలకోటేశ్వరస్వామి శివరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులు జరిగే ఈ ఉత్సవాలను వెల్వడం గ్రామానికి చెందిన ప్రవాసాంధ్రులు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నారు. ఉదయం నుంచి భక్తులు కోనేటిలో పుణ్యస్నానాలు ఆచరించి పితృ దేవతలకు పిండ ప్రదానం చేశారు. వృద్ధులు, మహిళలు స్నానాలు చేసేందుకు జల్లు స్నానాలు ఏర్పాటుచేశారు. భక్తులు దేవాలయంలోని ధ్వజ స్తంభానికి పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గొర్రెల కాపరులు తమ గొర్రెల మందతో వచ్చి గిరి ప్రదక్షిణ నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

చాట్రాయి: చాట్రాయిలోని ఉమారామలింగేశ్వర స్వామి ఆలయానికి తెల్లవారు ఝాము నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చి స్వామివారికి పూజలు చేశారు. పితృ దేవతలకు పిండ ప్రదానాలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. సి.గుడిపాడులోని నాగ లింగేశ్వరస్వామి ఆలయంలో రెండు వేల మందికి అన్నదానం చేశారు.

ఆగిరిపల్లి: స్థానిక సత్రం సెంటర్ వద్ద గంగా అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి ఆలయంలో, ఈదులగూడెం నాగేశ్వరస్వామి, సూరవరం మల్లేశ్వరస్వామి, కనసానపల్లి చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. స్థానిక వరహా పుష్కరిణి వద్ద గల ముక్తేశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి స్వామి వారి కల్యాణం నిర్వహించారు. శోభనాచలుని ఎగువ కొండపై దుర్గా పార్వతి సమేత మల్లికార్జున స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

- జి.కొండూరు: జి.కొండూరు పార్వతి సమేత అమృతలింగేశ్వర స్వామి ఆలయంలో ఉదయం 6 గంటలకు గురుప్రార్థన, బిల్వార్చన, మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకాలు, రుద్రహోమం వంటి పూజా కార్యక్రమాలను జరిపారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. మండలంలోని అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



జి.కొండూరు పార్వతి సమేత అమృత లింగేశ్వరస్వామి ఆలయంలో శివలింగం



ఆగిరిపల్లిలో పూజలందుకున్న మల్లికార్జునస్వామి



కొండపర్వ శివాలయంలో పూజల్లో పాల్గొన్న స్వామిదాసు, నాయకులు



వెల్వడం బాలకోటేశ్వరస్వామి ఆలయం వద్ద ధ్వజ స్తంభానికి పూజలు చేస్తున్న భక్తులు

పుణ్యస్నానాలు..

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి, సూరాయిపాలెం పుష్కర ఘాట్లలో భక్తులు పుణ్యస్నానాలాచరించారు. ఘాట్ల వద్ద భక్తులకు జల్లు స్నానాలకు ఏర్పాట్లు చేశారు. విజయవాడ రూరల్ ఎంపీడీఓ పాతూరి మురళీకృష్ణ ప్రసాద్, గొల్లపూడి పంచాయతీ కార్యదర్శి స్వరూపరాణి పర్యవేక్షించారు.



పవిత్ర సంగమం వద్ద పితృ దేవతలకు పిండ ప్రదానం



నూజివీడు మండలం అన్నవరంలో భజన చేస్తున్న భక్తులు



విస్సన్నపేట మండలం కొండపర్వ శివాలయంలో భక్తుల రద్దీ



పవిత్ర సంగమం వద్ద జల్లు స్నానాలు చేస్తున్న భక్తులు

బలివేకు పోటెత్తిన భక్తులు



ఆలయంలోని నాగేంద్ర స్వామి పుట్ట వద్ద పూజలు



బలివే ఆలయ బాహ్యలింగం వద్ద అభిషేకాలు

బలివే (ముసునూరు): భక్తుల శివ నామ స్మరణతో బలివే ప్రాంతం మార్మోగింది. మహా శివరాత్రి సందర్భంగా బుధవారం బలివేలోని బలే రామలింగేశ్వరాలయంలో ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో వైభవోపేతంగా నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రికి భక్తులు ఆలయ ప్రాంగణంలో బారులు తీరారు. బుధవారం తెల్లవారు జామున స్వామి వారికి విశేష అభిషేకం నిర్వహించిన అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించారు. దేవదాయ, రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీస్, తమ్మిలేరు నీటి పారుదల, వైద్య ఆరోగ్య శాఖలతో పాటు గ్రామ పంచాయతీ సమిష్టి కృషి ఫలితంగా ఉత్సవాలు విజయవంతమయ్యాయని సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్, తహసీల్దార్ కె.రాజ్‌కుమార్, ఈఓ సీతారామయ్య తెలిపారు.

స్వామిని దర్శించుకున్న ప్రముఖులు

మంత్రి పార్థసారథి, దెందులూరు ఎమ్మెల్యే ప్రభాకర్, జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్ రాజ్, డీఎస్పీ ప్రసాద్, ఏలూరుకు చెందిన జడ్జిలు, సీఐ రామకృష్ణ, ఎంపీడీఓ రాణి, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు స్వామివారిని దర్శించుకున్నారు.

భక్తుల సేవలో అధికారులు, స్వచ్ఛంద సంస్థలు

వైద్యాధికారి షకీనా ఇవాంజిలిన్ ఆధ్వర్యంలో వైద్యులు కరీముల్లా, భవాని, గౌతమ్ నిర్వహించిన నిరంతర వైద్య శిబిరంలో 620 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భద్రతాచర్యలు చేపట్టారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో పులిహోర, చక్ర పొంగలి, బిస్కెట్ ప్యాకెట్లు, మజ్జిగ, మంచినీళ్ల ప్యాకెట్లు పంపిణీ చేశారు.

ఉత్సవాల్లో అపశృతి

ఏలూరు పట్టణానికి చెందిన బొర్రా అన్నవరం (45) ఆలయ ప్రాంగణంలోకి వస్తూ కళ్లు తిరిగి పడిపోగా వైద్య శిబిరంలో ప్రథమ చికిత్స అనంతరం ఏలూరు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.



స్వామిని దర్శించుకుంటున్న జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్

రాష్ట్రాన్ని రుణాంధ్రగా మారుస్తున్న చంద్రబాబు

సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నేత హరినాథ్

నూజివీడు: రాష్ట్ర ప్రగతిపై ఎన్డీఏ కూటమి రాసిచ్చిన వ్యాసాన్ని గవర్నర్ వాస్తవాలను గ్రహించకుండా గుక్క తిప్పుకోకుండా చదివారని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.హరినాథ్ బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే కార్యక్రమంలో పీడీఎఫ్ ఎమ్మెల్సీలు వివరణాత్మకంగా చంద్రబాబు ఎన్నికల ముందు ఉద్యోగ వర్గాలకు, విద్యార్థులకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీల అమలుకు నోచుకోలేదని సహేతుకంగా ప్రశ్నించారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలైనా 2026 వరకు ప్రకటించిన పథకాలు అమలు చేయలేమని చేతులెత్తేశారన్నారు. 2026 జూన్ 12 నాటికి ఐదు లక్షల ఇళ్లు నిర్మిస్తామని, రానున్న విద్యా సంవత్సరం పాఠశాలల ప్రారంభం నాటికి మెగా డీఎస్సీ ప్రకటిస్తామని ప్రకటించటం విడ్డూరంగా ఉందని హరినాథ్ ఎద్దేవా చేశారు. రైతు భరోసా ఇవ్వకపోగా మిర్చి, మామిడి రైతులు సంక్షోభంలో ఉండగా రైతులు సుభిక్షంగా ఉన్నారని గవర్నర్ చెప్పడం వాస్తవాలను గ్రహించకపోవటమేనని ధ్వజమెత్తారు. చంద్రబాబుకు ఆదాయం పెంచుకోవడానికి పన్నులు విధించడంలో ఉన్న ఉత్సాహం ప్రజలకు రాయితీలు కల్పించడంలో ఉండదని, గతంలో కూడా రుణాల రద్దు విషయంలో వాయిదాల పర్వం కొనసాగించి పూర్తిగా చెల్లించనందునే ప్రజలు ఇంటికి పంపారన్నారు. కేంద్రం ఇచ్చే రైతు భరోసా రూ.6 వేలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.14వేలు కలిపి రూ.20 వేలను మూడు దఫాలుగా ఏ తేదీలోగా అందిస్తారో ప్రకటించాలని హరినాథ్ డిమాండ్ చేశారు. చంద్రబాబు పాలనలో రాష్ట్రం రుణాంధ్రగా మారడం ఖాయమన్నారు.

భక్తులకు తప్పని ట్రాఫిక్ కష్టాలు

ముక్త్యాల(జగ్గయ్యపేట):మహా శివరాత్రి సందర్భంగా ముక్త్యాలలో భక్తులకు ట్రాఫిక్ కష్టాలు తప్పలేదు. భక్తులు తెల్లవారుజాము నుంచే వాహనాల్లో కృష్ణానది వద్దకు తరలివచ్చారు. పోలీసులు గ్రామంలోని పందుల ఫారం వద్ద వాహనాల పార్కింగ్‌ను ఏర్పాటు చేశారు. ద్విచక్ర వాహనాలకు అరకిలోమీటరు దూరంలో పార్కింగ్ ఏర్పాటు చేయడంతో భక్తులు నడుచుకుంటూ ఆలయానికి చేరుకున్నారు. ఉదయం 10గంటల సమయంలో మూడు గంటల పాటు ట్రాఫిక్ నిలిచిపోవడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పోలీసులు చెప్పడమే తప్ప చేసిందేమీ లేదని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వామివారి దర్శనానికి విజయవాడ సీపీ రాజశేఖరబాబు రావడంతో అధిక శాతం మంది పోలీసులు ఆయన సేవలోనే ఉండి ట్రాఫిక్‌ను గాలికొదిలేశారనే విమర్శలు భక్తుల నుంచి వినిపించాయి. అంబులెన్స్ సైతం కొద్దిసేపు ట్రాఫిక్‌లో ఆగిపోయింది. ఈ క్రమంలో అక్కడే ఉన్న నందిగామ ఏసీపీ తిలక్ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం



తిరువూరులో పోలింగ్ సామగ్రి పంపిణీని పరిశీలిస్తున్న ఆర్డీఓ మాధురి

తిరువూరు: కృష్ణా–గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు తిరువూరు డివిజన్‌లో అధికారులు ఏర్పాట్లు చేశారు. తిరువూరు, గంపలగూడెం, విస్సన్నపేట, ఎ.కొండూరు, రెడ్డిగూడెం మండలాల్లోని 12 పోలింగ్ కేంద్రాల్లో 9,887 మంది పట్టభద్రులు తమ ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. తిరువూరు రెవెన్యూ డివిజనల్ అధికారి మాధురి ఆధ్వర్యంలో బుధవారం పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రిని తిరువూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాల ఆవరణలోని రిసెప్షన్ కేంద్రంలో సిబ్బందికి అప్పగించారు. ప్రత్యేక వాహనాల్లో పోలింగ్ సిబ్బంది ఎన్నికల సామగ్రితో సహా తరలివెళ్లారు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. 9,337 మంది ఓటర్లు ఈ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. వీరిలో 6,123 మంది పురుషులు, 3,211 మంది స్త్రీలు, ముగ్గురు ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు.

- చాట్రాయి: గురువారం జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తహసీల్దార్ డి. ప్రశాంతి తెలిపారు. బుధవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ చాట్రాయి జెడ్పీ హైస్కూల్‌లలో 9, 10 పోలింగ్ బూత్‌లలో 1,500 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కు వినియోగించుకుంటారని చెప్పారు.
- ఇబ్రహీంపట్నం: స్థానిక జాకీర్ హుస్సేన్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో మండలం వ్యాప్తంగా 4,495 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారని, ఇందుకోసం 8 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశామని ఎన్నికల ఉప అధికారి, మండల తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. ఓటర్ల స్లిప్పులు అందని వారు గుర్తింపు కార్డుతో పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటర్ లిస్ట్‌లో వరుస నంబర్ చెప్పి ఓటు వేయవచ్చని సూచించారు.
- మైలవరం: మైలవరం వీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎమ్మెల్సీ ఎన్నికలకు నాలుగు బూత్‌లు కేటాయించి, 16 మంది సిబ్బందిని నియమించారు. ఈ ఎన్నికల్లో మొత్తం 2,605 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తహసీల్దార్ అబ్దుల్ ధరియా తెలిపారు. సిబ్బంది ఎన్నికల సామగ్రిని పోలింగ్ బూత్‌లకు తరలించి భద్రపరిచారు. పోలింగ్ బూత్‌ల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేశారు.

9,652 మంది ఓటర్లు.. 12 పోలింగ్ స్టేషన్లు

నూజివీడు: నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, పట్టణంలో కలిపి 9,652 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారు. వీరు ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా 12 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయిల్లో రెండేసి చొప్పున పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయగా నూజివీడు పట్టణంలో ఆరు పోలింగ్ స్టేషన్‌లను సిద్ధం చేశారు. పోలింగ్ ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరుగుతుంది.

- జి.కొండూరు: మండల పరిధిలో 1,738 మంది ఓటర్లు ఉండగా స్థానిక శాగం శివరామిరెడ్డి జెడ్పీ హైస్కూలు భవనంలో రెండు పోలింగ్ బూత్‌లలో ఎన్నిక నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మొదటి బూత్‌లో 1022 మంది ఓటర్లు, రెండవ బూత్‌లో 716మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుంటారని చెప్పారు.
- రెడ్డిగూడెం మండల పరిధిలో మొత్తం 1,576మంది ఓటర్ల ఉండగా స్థానిక జెడ్పీ హైస్కూల్లో రెండు పోలింగ్ బూత్‌లను సిద్ధం చేశారు.